# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 07-07-2016**

తెలంగాణ రాష్ట్రం మరో కొత్త రికార్డు సృష్టించబోతున్నది. కేవలం రెండేళ్ల చిరుప్రాయంలోనే అనేక సరికొత్త పథకాలు, కార్యక్రమాలతో యావత్ దేశం దృష్టినీ, కొన్ని అంశాల్లో ప్రపంచం దృష్టిని ఆకర్షించిన తెలంగాణ రాష్ట్రం ఇప్పుడు 'తెలంగాణకు హరితహారం' అనే కార్యక్రమాన్ని రికార్డు స్థాయిలో చేపట్టి పచ్చని తెలంగాణకు భీజం వేస్తున్నది. తెలంగాణలో ఎటు చూసినా పచ్చదనం కనిపించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకుపోతున్నది. ఆకాశం నుంచి చూసిన వారికి తెలంగాణ అడవిలో నివసిస్తున్నది అనే విధంగా... రోడ్లపై ప్రయాణించే వారికి అందమైన ఉద్యానవనంలో తిరుగుతున్న అనుభూతిని కలిగించేలా తెలంగాణ ఉండాలన్నది ఆశయంగా మొక్కల పెంపకం సాగనున్నది. పూలచెట్లు, పండ్ల చెట్లు, నీడ చెట్లు, ఔషధ చెట్లతో తెలంగాణ అంతా నిండిపోవాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నది. పర్యావరణ సమతుల్యత ద్వారానే మానవజాతి మనుగడ సాధ్యమనే సత్యాన్ని నమ్మి అందుకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించింది. ఒకే ఏడాది 46 కోట్ల మొక్కలు నాటడం ద్వారా కొత్త రికార్డు సృష్టించబోతున్నది.

ఒకే సీజన్లో 46 కోట్ల మొక్కలు నాటడం ఒక రికార్డు. ఒకే రోజు హైదరాబాద్ నగరంలో 25 లక్షల మొక్కలు నాటడం మరో రికార్డు. ఒకే రోజు లక్ష మంది 163 కిలోమీటర్ల పొడవునా నిలబడి మొక్కలు నాటడం ఇంకో రికార్డు. ఇలా మూడు రికార్డులు హరితహారం ఈ సారి సృష్టించబోతున్నది. గతంలో ఏ రాష్ట్రంలో కూడా ఇంత పెద్ద ఎత్తున మొక్కలు నాటిన సందర్భం లేదు. ఈ నెల 8వ తేదీన ప్రారంభమయ్యే కార్యక్రమం రెండు వారాల పాటు తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, డివిజన్లు, మండలాలు, గ్రామాల్లో జరుగుతుంది. పాఠశాల విద్యార్థి నుంచి మొదలుకుని ముఖ్యమంత్రి, గవర్నర్ దాకా మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐఎఎస్,

ఐపిఎస్, ఎఎఫ్ఎస్ సహా అన్ని స్థాయిల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటుతారు. ప్రస్తుత ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గతంలో సిద్దిపేట ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు 'సిద్దిపేటకు హరితహారం' అనే కార్యక్రమం చేపట్టి నగరమంతా మొక్కలు నాటించారు. ఒకే రోజు కేవలం ఐదు నిమిషాల వ్యవధిలో దాదాపు 15వేల మొక్కలు పట్టణంలో నాటారు. మసీదులోని సైరన్ మోగించి ఏకకాలంలో ఈ పని పూర్తి చేసి రికార్డు సృష్టించారు. సిద్దిపేట పట్టణమంతా పచ్చదనంతో కళకళ లాడాలనే ఉద్దేశ్యంతో అప్పుడు ఆ పని చేశారు. అదే కార్యక్రమం స్ఫూర్తితో ఇప్పుడు తెలంగాణ అంతా గ్రీన్ కవర్ పెంచాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ 'తెలంగాణకు హరితహారం' అనే కార్యక్రమం తీసుకున్నారు. వాస్తవానికి 2015 జూలైలోనే మొదటి దశ కార్యక్రమాన్ని చిలుకూరు బాలాజి దేవాలయంలో ప్రారంభించారు. ఆరు జిల్లాల్లో ముఖ్యమంత్రి బస్సు యాత్ర నిర్వహించి స్వయంగా మొక్కలు నాటారు. గత ఏడాదే దాదాపు 40 కోట్ల మొక్కలు నాటడానికి ప్రణాళిక వేశారు. కానీ గతేడాది జూలై, ఆగస్టులో వర్షాలు కురవలేదు. ఫలితంగా హరితహారం కార్యక్రమం అనుకున్న స్థాయిలో నిర్వహించడం సాధ్యం కాలేదు. అయినప్పటికీ నీటి వసతి కలిగిన చోట్ల దాదాపు 15 కోట్ల మొక్కలు నాటారు. ఈ సారి వర్షాలు బాగా కురుస్తాయనే అంచనా ఉండడంతో ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించడానికి ప్రణాళిక వేశారు.

తెలంగాణ కీర్తి కిరీటంలో మరో కలికితురాయి

-----------------------------------------

2014 జూన్ 2న ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రం తనను తాను పునర్నిర్మించుకుంటూ, జాతి నిర్మాణంలో భాగం అవుతున్నది. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను మాత్రమే చేపట్టాలనే గట్టి నిర్ణయం తీసుకున్నది. ప్రజలే కేంద్రంగా, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ గారు అనేక పథకాలు, కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. జల సంరక్షణ, భూగర్భ జలాల వృద్ధి కోసం చేపట్టిన 'మిషన్ కాకతీయ', ఇంటింటికీ నల్లాల ద్వారా మంచినీరు అందించే 'మిషన్ భగీరథ', పేదింటి ఆడపిల్ల పెళ్లి భారాన్ని పంచుకునే 'కళ్యాణలక్ష్మి/షాదీ ముబారక్', పారిశ్రామిక సత్వర అనుమతుల కోసం 'టిఎస్ ఐపాస్' లాంటి కార్యక్రమాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్నది. దేశంలో ఇలాంటి కార్యక్రమాలు గతంలో ఎక్కడా ఎప్పుడూ అమలు కాలేదు. ఈ కార్యక్రమాలు దేశంలోని చాలా ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయి. మిషన్

కాకతీయ, మిషన్ భగీరథ లాంటి కార్యక్రమాలను దేశవ్యాప్తంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని నీతి ఆయోగ్ అన్ని రాష్ట్రాలకు సూచించింది. తెలంగాణ రాష్ట్రం అమలు చేస్తున్న ఇతర కార్యక్రమాలు కూడా అటు ప్రజలకు ఉపయోగపడుతూ, మరోవైపు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. కొత్త చరిత్రలు కూడా సృష్టిస్తున్నాయి. 46 వేల చెరువులను పునరుద్ధరించడం గతంలో ఎక్కడా ఎప్పుడూ జరగలేదు. 25వేల ఆవాస ప్రాంతాలకు నదీ జలాలను సురక్షిత మంచినీటిగా అందించిన దాఖలాలు కూడా ఎక్కడా లేవు. పేదింటి ఆడపిల్లల పెండ్లిళ్లను ప్రభుత్వమే రూ.51వేలిచ్చి జరిపించడం కూడా కొత్త చరిత్ర. కేవలం 15 రోజుల్లోనే పారిశ్రామిక అనుమతులు ఇవ్వడం ప్రపంచంలోనే ఎక్కడా లేదు. ఇవన్నీ రికార్డులు సృష్టించిన పథకాలే. ఇప్పుడు 'తెలంగాణకు హరితహారం' అనే కార్యక్రమం కూడా తెలంగాణ కీర్తి కిరీటంలో మరో కలికితురాయి కానుంది.

హరితహారం ఎందుకంటే...

----------------------------

భూభాగంలో 33 శాతం అడవులుండాలని పర్యావరణ వేత్తలు చెపుతున్నారు. అడవి సమృద్ధిగా ఉంటేనే సకల జీవరాశి మనుగడ సాగించగలుగుతుంది. భారతదేశంలో ఎక్కువ అడవులున్న పది దేశాల్లో ఒకటిగా ఉండేది. ఈ పది దేశాల్లో ఉన్న అడవే ప్రపంచంలోని అడవిలో 67 శాతం ఉండేది. రష్యా, బ్రెజిల్, కెనడా, అమెరికా, చైనా, ఆస్ట్రేలియా, కాంగో, ఇండోనేషియా, సూడాన్ తదితర దేశాల సరసన భారత్ ఉండేది. 1990 వరకు కూడా భారతదేశంలో అడవులు బాగానే ఉండేవి. భారతదేశంలో 22 శాతం, తెలంగాణలో 24 శాతం భూభాగం అటవీ ప్రాంతంగా నిర్ధారించబడింది. ఈ భూభాగంలో దట్టమైన అడవులు ఉండడంతో పాటు జనవాస ప్రాంతాల్లో కూడా పెద్ద ఎత్తున చెట్లుండేవి. కానీ రానురాను పరిస్థితిలో చాలా మార్పు వచ్చింది. జనావాసాలు పెరిగిపోవడం, పెరుగుతన్న జనాభా అవసరాలు తీర్చడం కోసం అడవి ఓ వనరులా ఉపయోగపడడం, పోడు వ్యవసాయం పెరగడం, చెట్లు నరికివేతకు గురికావడం తదితర కారణాల వల్ల అటు అడవిలో, ఇటు నివాస ప్రాంతాల్లో చెట్ల సంఖ్య అంతరించిపోయింది. అటవీ ప్రాంతంగా ప్రకటించిన 24 శాతం భూభాగంలో కూడా సగం శాతం కూడా చెట్లు లేవు. అడవులు అంతరించిపోవడం వల్ల అనేక అనర్థాలు జరుగుతున్నాయి. అనావృష్టి లాంటి వైపరీత్యాలతో పాటు, అడవిని ఆధారం చేసుకుని బతుకుతున్న జీవాలు జనావాసాలపై

పడిపోతున్నాయి. కోతుల నుంచి మొదులుకుని పులుల వరకు అడవిని వదిలి జనంపై పడుతున్నాయి. అటవీ ఉత్పత్తులు కూడా తగ్గిపోయాయి. వర్షాలు కురవడం లేదు. గతంలో దేశ జిడిపిలో అటవీ ఉత్పత్తుల శాతం 1.7 శాతం ఉంటే, ఇప్పుడు ఒక శాతం కూడా లేదు. అడవులు నశించిపోవడం వల్ల భూమిలోకి నీరు కూడా ఇంకకపోవడం, భూగర్భ జలాల అంతరించిపోవడం తదితర పరిణామాలు సంభవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణలో అడవుల శాతాన్ని 33కు తీసుకుపోవడమొక్కటే పరిష్కారం అని కేసీఆర్ గారు భావించారు. 'కోతులు అడవికి వాపస్ పోవాలి, వానలు వాపస్ రావాలి' అనే నినాదం అందుకున్నారు. 'దేశ ప్రగతికి మెట్లు, పెరిగే చెట్లు' అని చాటిచెప్పారు. అందుకోసం ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్ల నుంచే ప్రణాళిక వేశారు. అటవీశాఖకు ప్రాధాన్యం పెంచారు. బడ్జెట్ కేటాయింపులు పెంచారు. తెలంగాణకు హరితహారం కోసం ప్రత్యేక నిధులు వెచ్చిస్తున్నారు.

కార్యాచరణ ఇదీ...

-------------------

తెలంగాణలో ఉన్న 24 శాతం అటవీ ప్రాంతంలో నూటికి నూరు శాతం అడవులు పెంచాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అలాగే పట్టణాలు, గ్రామాల్లో కూడా పెద్ద ఎత్తున సామాజిక అడవుల పెంపకం చేపట్టాలని నిర్ణయించారు. తెలంగాణ వ్యాప్తంగా ఐదేళ్ల కాలంలో 230 కోట్ల మొక్కలు నాటి, వాటిని సంరక్షించడమే లక్ష్యంగా 'తెలంగాణకు హరితహారం' కార్యక్రమాన్ని గతేడాదిలో ముఖ్యమంత్రి ప్రారంభించారు. అటవీ ప్రాంతంలో 100 కోట్ల మొక్కలు, సామాజిక అడవుల కింద 120 కోట్ల మొక్కలు, హైదరాబాద్ నగర పరిధిలో 10 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం మొదటి ఏడాదే దాదాపు 3500 నర్సరీలు ఏర్పాటు చేసి, మొక్కలు తయారు చేశారు. మొదటి ఏడాది వర్షాలు సరిగా కురవక పోవడం వల్ల కేవలం 15 కోట్ల మొక్కలు మాత్రమే నాటి పెంచగలిగారు. ఈ సారి 46 కోట్ల మొక్కలు నాటాలనే లక్ష్యం పెట్టుకున్నారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 4,213 నర్సరీల్లో మొక్కలు తయారయి ఉన్నాయి. సగటున ప్రతీ రెండు గ్రామాలకు ఒక నర్సరీ ఉంది. కేవలం ఒకే రకం చెట్లు కాకుండా నీడనిచ్చే చెట్లు, పండ్ల చెట్లు, పూల చెట్లు, ఔషధ మొక్కలను కూడా నాటడానికి కార్యాచరణ తయారైంది. ఈ ఏడాది నాటే 46 కోట్ల మొక్కల్లో 36.81 మొక్కలు నీడ నిచ్చే వేప, మర్రి, రావి లాంటి చెట్లున్నాయి. టేకు, మద్ది లాంటి లాభదాయక చెట్లు మరో 8.5

కోట్లున్నాయి. పండ్ల చెట్లు కోటి దాకా ఉన్నాయి. మిగతావి పూల చెట్లు. చెరువు కట్టలపై పెంచడానికి మరో కోటి దాకా ఈత మొక్కలు కూడా సిద్ధమవుతున్నాయి. అటవీ ప్రాంతంలోనే కాకుండా అన్ని రహదారులకు ఇరువైపులా, విద్యాలయాల్లో, పోలీస్ ప్రాంగణాల్లో, మార్కెట్ యార్డుల్లో, వ్యవసాయ క్షేత్రాల్లో, స్మశాన వాటికలు, గ్రేవ్ యార్డుల్లో, పరిశ్రమల్లో, పారిశ్రామిక వాడల్లో, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, విమానాశ్రయాల్లో మొక్కలు నాటనున్నారు. కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ప్రజా ఉద్యమంగా తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఇందుకోసం సమాజంలో ప్రతీ ఒక్కరినీ భాగస్వాములను చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ రంగ సంస్థలైన ఆర్టీసీ, సింగరేణి, విద్యుత్ శాఖలతో కూడా సమన్వయం ఏర్పరుచుకుని వారి ద్వారా కూడా పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉన్న సైనిక దళాల ప్రాంగణాలు, రైల్వే ప్రాంగణాలు, విమానాశ్రయాలు, జాతీయ రహదారులు, ఇతర కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల నిర్వాహకులతో కూడా ఇప్పటికే సమన్వయ సమావేశాలు నిర్వహించింది ప్రభుత్వం. వారిని కూడా తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగస్వామ్యం చేస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వంలోని దాదాపు 25 కీలక శాఖలు ఎవరికి వారుగా కార్యాచరణ రూపొందించుకుని మొక్కలు నాటే ఉద్యమంలో భాగస్వాములు అవుతున్నారు. పాఠశాల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, డ్వాక్రా మహిళలతో సహా అందరూ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటేలా ప్రణాళిక రూపొందించారు. మొక్కలు నాటాలనే స్పృహ పెంచడానికి అవకాశం ఉన్న అన్ని అంశాలను ప్రభుత్వం ఉపయోగించుకుంటున్నది. రాశులు, జన్మ నక్షత్రాల ప్రకారం మొక్కలు నాటే ఆచారం కూడా భారతదేశంలో ఉన్నది. ఈ వివరాలను కూడా ప్రభుత్వం ప్రజలకు అందించింది. వారి కోరిక మేరకు కావాల్సిన మొక్కలు అందించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.

జాతీయ రహదారులపై ప్రత్యేక దృష్టి

-----------------------------------

తెలంగాణ రాష్ట్రం గుండా 15 జాతీయ రహదారులు వెళుతున్నాయి. ఇందులో ఐదు జాతీయ రహదారులు చాలా పెద్దవి. ఈ జాతీయ రహదారులకిరువైపులా పెద్ద ఎత్తున పూల చెట్లు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. జాతీయ రహదారుల సంస్థతో సమన్వయంతో ఈ కార్యక్రమం చేపట్టుతున్నది. తెలంగాణ

సరిహద్దుల వరకు జాతీయ రహదారుల వెంట చెట్లు పెంచుతున్నది. హైదరాబాద్ - విజయవాడ, హైదరాబాద్ -ముంబాయి, హైదరాబాద్ - వరంగల్, హైదరాబాద్ – బెంగుళూరు, హైదరాబాద్ - నాగపూర్ ప్రధాన రహదారులను ముందుగా ఎంచుకున్నది. ఇందులో భాగంగా హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిని పైలట్ ప్రాజెక్టుగా ఎంచుకున్నది. హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్లే జాతీయ రహదారిపై తెలంగాణ సరిహద్దుల వరకు 163 కిలోమీటర్ల మేర రోడ్డుకిరువైపులా అందమైన రకరకాల పూల చెట్లు, నీడనిచ్చే చెట్లు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమాన్ని నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి వద్ద ముఖ్యమంత్రి శ్రీ కేసీఆర్ గారు ప్రారంభించనున్నారు. అదే సమయంలో 163 కిలోమీటర్ల రోడ్డుపై ఒకేసారి లక్ష మంది లక్షా 50 వేల మొక్కలు కేవలం రెండు గంటల వ్యవధిలో నాటుతారు. హైదరాబాద్ శివార్లలోని రామోజీఫిల్మ్ సిటీ దగ్గరున్న అబ్దుల్లామెట్ నుంచి నల్లగొండ జిల్లా కోదాడ మండలం నల్లబండగూడెం వరకు మొక్కలు నాటుతారు. ఈ మొత్తం రహదారిని 14 సెంగ్మెంట్లుగా విభజించారు. ఒక్కో సెంగ్మెంటుకు ఒక్కో అధికారిని ఇంచార్జిగా నియమించారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర సరిహద్దుల వరకు ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు, 10 మండలాలు, 50 గ్రామాలు వస్తాయి. ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు కూడా స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటేలా కార్యాచరణ రూపొందించారు. 14 సెంగ్మెంట్లలో మొక్కలు పంచుతారు. ఒకే సమయంలో లక్ష మంది 163 కిలోమీటర్ల మేర మొక్కలు నాటడం కూడా ఓ రికార్డే.

25 లక్షల మొక్కలతో హైదరాబాద్ రికార్డు

-----------------------------------------

'తెలంగాణకు హరితహారం' కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ నగరంలో కూడా పెద్ద ఎత్తున మొక్కలు నాటడానికి రంగం సిద్దమైంది. హైదరాబాద్ నగరంలో కూడా చాలా అటవీ భూములు, పార్కులు, చెరువులున్నాయి. వాటిలో మొక్కలు పెంచడంతో పాటు జనావాస ప్రాంతాల్లో ప్రతీ ఇంటిలో, ప్రతీ పార్కులో చెట్లు పెంచడానికి ఏర్పాట్లు జరిగాయి. ఐదేళ్లలో హెచ్ఎండిఏ పరిధిలో 7 కోట్లు, జిహెచ్ఎంసి పరిధిలో 3 కోట్లు మొత్తం పది కోట్ల మొక్కలు పెంచాలన్నది లక్ష్యం. ఇందులో భాగంగా ఈ సారి ఒకే రోజు జూలై 11న 25లక్షల మొక్కలు నాటుతారు. ఇందుకోసం జిహెచ్ఎంసి, హెచ్ఎండిఏ, అటవీశాఖ, పరిశ్రమల శాఖ, ఐటి శాఖ,

ఉద్యానవన శాఖ, పోలీస్ శాఖ తదతర ప్రభుత్వ శాఖలు సంయుక్తంగా కార్యచరణ రూపొందించాయి. హైదరాబాద్ కు కావాల్సిన మొక్కలు సరఫరా చేయడం కోసం నగరంలోని వివిధ ప్రాంతాల్లో 100 నర్సరీలున్నాయి. ఒకే రోజు 25 లక్షల మొక్కలు నాటడం కూడా ఓ రికార్డుగా నిలవనుంది.

**సిపిఆర్ఓ టు సిఎం**